JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 25-06-2026
Medchal - Malkajgiri । Thursday 25-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 24
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 24 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# తుంగభద్ర ఎత్తిపోతల పథకం



జయభేరి, హైదరాబాద్ :

తుంగభద్ర నుంచి తెలంగాణకు రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి, భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. RDS కింద జోగులాంబ గద్వాల జిల్లాలో దాదాపు 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి కేంద్ర జల సంఘం సారథ్యంలో తుంగభద్ర బోర్డును పటిష్టం చేయాలని కోరారు. తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జలసౌధలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్డీఎస్ ఆనకట్ట ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాజోలి బండ డైవర్సన్ కెనాల్ ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ. 59 కోట్లు డిపాజిట్ చేసిందని, పనులు ఇప్పటికీ పూర్తి

...మిగతాది 2 లో



# తెలంగాణలో నేటి నుంచే 'సర్'

- నెలరోజుల పాటు ఇంటింటి సర్వే
- ఇంటింటికీ బూత్ స్థాయి అధికారులు
- రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం, గణాంకాలు
- ఆన్‌లైన్ ద్వారా కూడా సులభంగా సవరణలు
- రంగంలోకి రాజకీయ పార్టీలు


జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ గురువారం నుంచే అధికారికంగా ప్రారంభం కానుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన ప్రతి ఓటరుకూ తమ వివరాలను సరిచూసుకునే, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే సువర్ణ అవకాశం లభిస్తుంది. ఈ భారీ ఇంటింటి సర్వే ప్రక్రియ వచ్చే జులై 24వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎన్నికల అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

**ఇంటింటికీ బూత్ స్థాయి అధికారులు**

ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటినీ కనీసం మూడు పర్యాయాలు సందర్శించనున్నారు. ప్రతిరోజూ తమ బూత్ పరిధిలోని కనీసం 50 ఇళ్లను సందర్శించి ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేయడం వీరి ప్రధాన విధి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు ఈ ఎన్యూమరేషన్ పత్రాలను చేరవేయనున్నారు. ఈ పత్రాల పంపిణీలో భాషా పరమైన సౌలభ్యాన్ని కూడా అధికారులు కల్పించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో నివసించే ఓటర్లకు

# ఏపీ చరిత్రలోనే సువర్ణ అధ్యాయం




- జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఈ బంగారు గని, రాబోయే రోజుల్లో భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేయనుంది

జయభేరి, విజయవాడ, జూన్ 24 :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం మొదలైంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తూ.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో ప్రతిష్టాత్మక బంగారు గని ఉత్పత్తి దశకు చేరుకుంది. బుధవారం (జూన్ 24) ఈ భారీ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. రాయలసీమ గడ్డపై వెలుగు చూసిన ఈ బంగారు గని, రాబోయే రోజుల్లో భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేయనుంది. దేశంలోనే ఏపీని అతిపెద్ద బంగారు సరఫరాదారుగా నిలబెట్టబోతోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం మొదలైంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తూ.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో ప్రతిష్టాత్మక బంగారు గని ఉత్పత్తి దశకు చేరుకుంది. బుధవారం (జూన్ 24) ఈ భారీ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. రాయలసీమ గడ్డపై వెలుగు చూసిన ఈ బంగారు గని, రాబోయే రోజుల్లో భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేయనుంది. దేశంలోనే ఏపీని అతిపెద్ద బంగారు సరఫరాదారుగా నిలబెట్టబోతోంది. ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైనింగ్ క్షేత్రంలో కీలకమైన విభాగాలను

...మిగతాది 2 లో




# భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

జయభేరి, ముంబై, జూన్ 24 :

ఇరాన్‌ఇజ్రాయెల్‌అమెరికా యుద్ధం యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరి, ఇంధన, వాణిజ్య సంక్షోభం తలెత్తేలా కనిపించింది. కానీ తాజాగా అమెరికా ఇరాన్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంతో చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు $77.39 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతుంటే.. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు $73.57 వద్ద ట్రేడ్ అవుతోంది.అయితే ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో, ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అవసరానికి మించి పెరిగిపోతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి.

...మిగతాది 2 లో


# బరి తెగిస్తున్న మైనింగ్ మాఫియా



జయభేరి, భూపాలపల్లి, జూన్ 24 :

తెలంగాణలో మైనింగ్, రవాణా మాఫియా ఏ స్థాయికి తెగబడిందో అద్దం పట్టేలా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత దారుణమైన ఘోరం చోటుచేసుకుంది. జిల్లా రవాణా అధికారి ఎం. వెంకన్న సోమవారం తెల్లవారుజామున చెల్పూర్ పరిసరాల్లో విధి నిర్వహణలో ఉండగా, బొగ్గు లోడ్‌తో వేగంగా దూసుకొచ్చిన ఒక లారీ ఆయనపై నుంచి దూసుకెళ్లింది. ఆర్‌టీఓ ఆఫీస్ సమీపంలో అక్రమ రవాణా, ఓవర్‌లోడింగ్ తనిఖీలు చేస్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం జరగడం, ఘటనా స్థలంలోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం రవాణా శాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అందర్నీ షాక్‌కు గురిచేసింది. అయితే, ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిన ప్రమాదమా? లేక కావాలనే జరిపిన హత్యా అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటన వెనుక బొగ్గు అక్రమ రవాణా మాఫియా హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భూపాలపల్లి ప్రాంతంలో ఓవర్‌లోడింగ్ లారీలపై గత కొంతకాలంగా రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డీటీఓ వెంకన్న లారీలను ఆపేందుకు ప్రయత్నించినప్పుడు, డ్రైవర్ లారీని ఆపకుండా నేరుగా ఆయనపైకే పోనిచ్చాడని ప్రత్యక్ష సాక్షుల సమాచారం. సాధారణంగా అధికారులు

...మిగతాది 2 లో



# ఎయిర్ హోస్టెస్‌తో అసభ్య ప్రవర్తన

- భారతీయుడికి 6 నెలల జైలు శిక్ష

జయభేరి, న్యూఢిల్లీ:

సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో ఓ మహిళా క్యాబిన్ సిబ్బందిని వేధించి, అసభ్యంగా ప్రవర్తించిన కేసులో 35 ఏళ్ల భారతీయుడు ఆకాశ్ తివారీకి సింగపూర్ కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అదనంగా బాధితురాలికి పరిహారంగా 1,270 సింగపూర్ డాలర్లు (సుమారు 982.25 అమెరికన్ డాలర్లు) చెల్లించాలని కూడా ఆదేశించింది. ఈ ఘటన ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగినట్లు సమాచారం. ఆకాశ్ తివారీ తన నలుగురు స్నేహితులతో కలిసి బ్యాంకాక్ నుంచి సింగపూర్ వెళ్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణిస్తున్నాడు. కోర్టు పత్రాల ప్రకారం, విమానం టేకాఫ్‌కు ముందు ప్రయాణికుల భోజన అభిరుచులను తెలుసుకునేందుకు వచ్చిన మహిళా ఫ్లైట్ అటెండెంట్ దగ్గరకు వెళ్లిన

...మిగతాది 2 లో

# తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాల పండుగ




...మిగతాది 2 లో

- ఈ యేడు ఆషాఢ బోనాలను మూడు కార్పోరేషన్ల పరిధిలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నాం
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బోనాలను విజయవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాల కల్పనతో ఏ లోటూ రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి
- బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల భక్తి, ప్రజల సామూహిక విశ్వాసాలకు ప్రతీక అన్న మంత్రి
- రాష్ట్రం నలుమూలల నుంచి బోనాల జాతర ఉత్సవాలను చూసేందుకు భక్తుల తరలివచ్చే పరిస్థితుల నేపథ్యంలో రవాణా శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరిన మంత్రి సురేఖ




...మిగతాది 3 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణలో నేటి నుంచే 'సర్'

ఆంగ్ల భాషలో (ఇంగ్లిష్), అలాగే రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల ఓటర్లకు తెలుగు భాషలో ఈ ఎన్యూమరేషన్ పత్రాలను అందజేస్తారు. ఓటర్లు తమ ఆధార్ కార్డులోని వివరాలతో ఓటరు జాబితాలోని పేరు, ఇతర వివరాలను సరిపోల్చుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఒకవేళ ఎన్యూమరేషన్ పత్రాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉన్నా, లేదా మీ ఇంటికి బీఎల్ఓ రాకపోయినా, వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించిన 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి అవసరమైన సమాచారాన్ని లేదా ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ఈ మహా క్రతువును విజయవంతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా ఒక భారీ యంత్రాంగం రంగంలోకి దిగింది. మొత్తం 33 జిల్లాల ఎన్నికల అధికారులు (డీఈఓలు) ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సర్వే సాగనుంది. ఇందుకు సంబంధించిన ముఖ్యమైన గణాంకాలు

మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు: 119
మొత్తం పోలింగ్ బూతులు: 35,985
రాష్ట్రంలోని మొత్తం ఓటర్లు: 3,38,26,448
మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు: 2,38,62,322
అన్‌మ్యాపింగ్ ఓటర్లు: 99,64,126
ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు): 119
బీఎల్ఓ పర్యవేక్షకులు: 3,596
రంగంలో ఉన్న బీఎల్ఓలు: 35,985

**ఆన్‌లైన్ ద్వారా కూడా సులభంగా సవరణలు**

డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకుంటూ, ఎన్నికల సంఘం ఓటర్లకు ఆన్‌లైన్ ద్వారా కూడా సవరణలు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. బీఎల్ఓలు ఇచ్చే భౌతిక పత్రాలే కాకుండా, ఓటర్లు నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ అయిన [https://voters.eci.gov.in](https://voters.eci.gov.in) లోకి లాగిన్ అయి తమ వివరాలను ఆన్‌లైన్ లోనే నింపవచ్చు. గతంలో మొబైల్ నంబర్ రిజిస్టర్ చేసుకున్న వారు లేదా తమ ఎపిక్ (EPIC) కార్డు నంబర్‌ను ఉపయోగించి ఓటరు పోర్టల్‌లోకి సులభంగా ప్రవేశించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

సమగ్ర ఎన్నికల షెడ్యూల్ వివరాలు

ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రోగ్రాం అక్టోబర్ మొదటి వారం వరకు వివిధ దశల్లో సాగనుంది. ఆ వివరాలు కింది విధంగా ఉన్నాయి

జూన్ 25 నుండి జులై 24 వరకు: బీఎల్ఓల ద్వారా ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ.
జులై 31: ఓటర్ల ముసాయిదా జాబితా అధికారిక ప్రచురణ.
జులై 31 నుండి ఆగస్టు 30 వరకు: ముసాయిదా జాబితాపై ప్రజల నుండి ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ.
జులై 31 నుండి సెప్టెంబరు 28 వరకు: సందేహాలు లేదా లోపాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వాటిని నివృత్తి చేసే సమయం.
అక్టోబరు 1: అన్ని సవరణలు పూర్తి చేసిన అనంతరం తెలంగాణ రాష్ట్ర తుది ఓటర్ల జాబితా ప్రకటన.

రాష్ట్రంలో సర్ ప్రారంభం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు సైతం అప్రమత్తమయ్యాయి. క్షేత్రస్థాయిలో తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు, కొత్త ఓటర్లను చేర్పించేందుకు వీలుగా బూత్ లెవెల్ ఏజెంట్లను (బీఎల్ఏ) పార్టీలు నియమించుకుంటున్నాయి. అధికారుల సమన్వయంతో పనిచేసేందుకుగాను ఇప్పటివరకు దాదాపు 49,018 మంది బీఎల్ఏల వివరాలను రాజకీయ పార్టీలు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయానికి మరియు స్థానిక ఈఆర్ఓలకు అందజేశాయి. ఓటర్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

రాబోయే రెండేళ్లలో ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్ కంటే చాలా వేగంగా పెరుగుతుందని, తద్వారా 2027 నాటికి చమురు మిగులు ఏర్పడుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో జరిగిన యుద్ధం కారణంగా రోజుకు 14 మిలియన్ బ్యారెళ్ల (bpd) చమురు ఉత్పత్తి నిలిచిపోయిందని IEA అంచనా వేసింది.క్రిస్టల్ ఎనర్జీ గ్లోబల్ అడ్వైజర్ క్రిస్టాఫ్ రూహ్ల్ అభిప్రాయం ప్రకారం.. 2027 నాటికి ప్రపంచ సరఫరా, డిమాండ్ కంటే రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని గేట్ వే హౌస్‌లో ఎనర్జీ, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కనెక్టివిటీ సీనియర్ ఫెలో అమిత్ భండారీ తెలిపారు. అయితే ఈ తగ్గదల అనేది తక్షణమే ఉండకోవచ్చని.. దానికి దాదాపు 56 నెలల సమయం పడుతుందన్నారు.అంతేకాదు రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన మార్కెట్లలో భారీ మార్పులు రాబోతున్నాయని నిపుణులు అంటున్నారు. 2027 నాటికి ప్రపంచ చమురు సరఫరా రోజుకు సుమారు 8 మిలియన్ బ్యారెళ్లు పెరుగుతుందని, కానీ డిమాండ్ కేవలం 2 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారీ ఎత్తున చమురు మిగులు ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తోందని.. ఇది ధరలను తగ్గించడమే కాకుండా.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఏర్పడి కొరతను ఫుల్‌ఫిల్ చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు.అమెరికాఇరాన్ ఒప్పందం ఇలాగే కొనసాగితే గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు క్రమంగా పుంజుకుంటాయని IEA భావిస్తోంది. శాశ్వత ఒప్పందం కుదిరి, ఇరాన్ ఎగుమతులపై ఆంక్షలు తొలగిపోతే, మరింత ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తుంది. ఇది సరఫరాను మరింత మెరుగుపరిచి, చమురు ధరలపై ఉన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొంది.

## ఎయిర్ హోస్టెస్‌తో అసభ్య ప్రవర్తన

సమయంలో తివారీ తన చేతులను చాపి ఆమె కాలికి తగిలేలా చేశాడు. ప్రయాణం మొత్తం ఆ మహిళా సిబ్బంది వారి సీట్ల పక్కగా వెళ్లిన ప్రతిసారి తివారీతో పాటు అతని స్నేహితులు నవ్వుతూ ఆమెను అసౌకర్యానికి గురిచేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని బాధితురాలు చీఫ్ స్టీవర్డెస్‌కు తెలియజేయడంతో ఆమెను మరో విభాగంలో విధులు నిర్వహించేలా మార్చారు. అయినప్పటికీ వేధింపులు ఆగలేదు. తర్వాత ట్రేలను సేకరించేందుకు ఆ మహిళ తిరిగి వారి వద్దకు వెళ్లినప్పుడు, తివారీ తన మోచేతిని ఆమె వీపుకు తగిలేలా చేశాడని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆమె మరోసారి ఫిర్యాదు చేసింది. దీని అనంతరం సీనియర్ సహోద్యోగితో కలిసి ఫ్లైట్ అటెండెంట్ తివారీని నిలదీయగా, అతను ఎలాంటి తప్పు చేయలేదని నిరాకరించాడు. అయితే బాధితురాలు పలుమార్లు తనను తాకవద్దని హెచ్చరించినప్పటికీ, అతను ఆరోపణలను తేలికగా తీసుకుంటూ చిరునవ్వు చిందించాడని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అంతటితో ఆగకుండా, విమానం ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో తివారీ ఆ మహిళా సిబ్బందిని అనుసరిస్తూ విమానంలోని గ్యాలీ ప్రాంతంలోకి వెళ్లాడు. అది చాలా ఇరుకైన ప్రదేశం కావడంతో అతను ఆమెకు అత్యంత సమీపంలో నిలబడ్డాడు. పలుమార్లు దూరంగా ఉండాలని హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో, చివరకు ఆమెను మూలకు నెట్టిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భయాందోళనకు గురైన ఫ్లైట్ అటెండెంట్ అతనిపై గట్టిగా అరవాల్సి వచ్చింది. మరోవైపు, తివారీ మోచేతితో ఆమె వీపును తాకిన ఘటన సమయంలో, అతని స్నేహితుడు జయ్ శంకర్ "ఒక బీర్ తాగుతూ ఈ 'షో'ను చూస్తాను" అని వ్యాఖ్యానించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనను వెంటనే విమాన కెప్టెన్‌కు నివేదించారు. విమానం సింగపూర్ చాంగీ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత విమానాశ్రయ అధికారులు పోలీసు దర్యాప్తు ప్రారంభించారు. చివరగా, సోమవారం జరిగిన విచారణలో ఆకాశ్ తివారీ తనపై ఉన్న అసభ్య ప్రవర్తన, వేధింపుల ఆరోపణలను అంగీకరించడంతో సింగపూర్ కోర్టు అతనికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ఇదే సందర్భంగా, మరో సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో 20 ఏళ్ల భారతీయ యువకుడు కూడా ఓ ఫ్లైట్ అటెండెంట్‌ను వేధించిన మరో కేసును ది ఇండిపెండెంట్ ప్రస్తావించింది.

# లక్షల లెక్కలు కాగితాలపై...
# కోట్ల లెక్కలు క్షేత్రస్థాయిలో!

మనం ఎప్పుడూ కొన్ని తప్పుడు ప్రశ్నలు అడుగుతూంటాం.ఒక ఎంపీ జీతం ఎంత?ఒక ఎమ్మెల్యేకు ఎన్ని అలవెన్సులు వస్తాయి? ప్రజాప్రతినిధులకు ఎన్ని సౌకర్యాలు ఉన్నాయి? ఇలాంటివే...సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో, టీ స్టాళ్ల దగ్గర... ఈ చర్చ ఎక్కువగా జరుగుతుంది. కానీ ఈ క్రమంలో అవసరమైన ఓ ప్రశ్న మాత్రం ఎక్కడో మిస్సవుతోంది. అదేంటో తెలుసా?ఒక ఎంపీ కావడానికి ఎంత ఖర్చవుతుంది? ఒక ఎమ్మెల్యే సీటు గెలవడానికి ఎంత డబ్బు ఖర్చవుతుంది అని. ఎందుకంటే ..2024 ఎన్నికల్లో భారతదేశం ఖర్చు చేసిన మొత్తం అమెరికా ఎన్నికల ఖర్చును కూడా దాటిపోయింది. అదెంత..అలా ఎలా జరిగింది అంటారా?దేశం మొత్తం కలిపి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చైన మొత్తం డబ్బు దాదాపు ₹1.35 లక్షల కోట్లు అని నివేదికలు చెబుతున్నాయి. ఈ సంఖ్య ఎంత పెద్దదంటే... భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు... ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రజాస్వామ్యంగా కూడా మారుతోందా అనే ప్రశ్నను లేవనెత్తే స్థాయిలో ఉంది.

ఎన్నికల ఖర్చు గ్రాఫ్ 2014, ₹30,000 కోట్లు2019, ₹60,000 కోట్లు 2024, ₹1,35,000 కోట్లుఅంటే... కేవలం 10 ఏళ్లలో ఎన్నికల ఖర్చు నాలుగు రెట్లు పెరిగిందిఎన్నికల సంఘం ప్రకారం ఒక లోక్‌సభ అభ్యర్థి గరిష్టంగా ₹95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి.

ఎమ్మెల్యే అభ్యర్థులకు కూడా పరిమితి ఉంది. కాగితాలపై చూస్తే అంతా బాగానే కనిపిస్తుంది. కానీ రాజకీయాలను దగ్గరగా గమనించే వారికి ఒక విషయం స్పష్టంగా తెలుసు.ఎన్నికలు నామినేషన్‌తో మొదలవ్వవు. దానికి నెలల ముందు నుంచే మొదలవుతాయి. ప్రచారానికి టీమ్ లు, సోషల్ మీడియా టీమ్‌లు, సర్వేలు, వ్యూహకర్తలు, కార్యకర్తల నిర్వహణ, సమావేశాలు, ర్యాలీలు... ఇవన్నీ అధికారిక లెక్కల్లో కనిపించవు.అందుకే ఒక తీవ్రమైన పోటీ ఉన్న ఎంపీ స్థానం కోసం ₹30 కోట్ల నుంచి ₹50 కోట్ల వరకు ఖర్చవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో కూడా ఖర్చు ₹10 కోట్ల నుంచి ₹25 కోట్ల వరకు వెళ్తోందని అంచనాలు ఉన్నాయి.ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే పోస్టర్లు, పాంప్లేట్లు, కొన్ని సభలు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ వార్ రూమ్స్. డేటా అనలిటిక్స్. మీడియా ప్రకటనలు.






సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు. ప్రత్యేక పీఆర్ టీమ్ లు. హెలికాప్టర్లు. భారీ కాన్వాయ్‌లు. వేలాది మంది కార్యకర్తల నిర్వహణ. ఇవన్నీ చూస్తే... ఎలక్షన్స్ ఇప్పుడు కార్పొరేట్ మార్కెటింగ్ క్యాంపెయిన్‌గా అనిపిస్తున్నాయి.ఖచ్చితంగా చెప్పాలంటే... ఒక కంపెనీ తన ఉత్పత్తిని అమ్మడానికి ఎంత ప్లాన్ చేస్తుందో... రాజకీయ పార్టీలు కూడా ఓటును పొందడానికి అంతే ప్రణాళికతో పనిచేస్తున్నాయి. సంఖ్య వినడానికి పెద్దగా అనిపిస్తుంది. కానీ దాని పరిమాణం అర్థం కావాలంటే మరో కోణంలో చూడాలి.

ఆ డబ్బుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించవచ్చు. వందలాది ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించవచ్చు. లక్షల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించవచ్చు. కానీ ఆ మొత్తం డబ్బు కేవలం కొన్ని వారాల ఎన్నికల ప్రచారంలో ఖర్చయిందంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇవి లేకుండా ఎన్నికలలో పోటీ చెయ్యలేమా అంటే..పోటీ ప్రపంచంలో తప్పదు అంటారు.ఎన్నికల సమయంలో నగదు, మద్యం, బంగారం, బహుమతులు పట్టుబడ్డాయనే వార్తలు మనం తరచూ చూస్తుంటాం. కానీ వాటి మొత్తం విలువ ఎప్పుడైనా గమనించారా?2019 ఎన్నికల్లో సీజ్ చేసిన నగదు, బంగారం, మద్యం, డ్రగ్స్ తదితర వస్తువుల విలువ ₹3,477 కోట్లు.2024లో అది ₹10,000 కోట్లకు పైగా చేరింది. అంటే ఐదేళ్లలో దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. పట్టుబడింది ఇంత ఉంటే... పట్టుబడనిది ఎంత ఉంటుంది? ఒక్క సారి ఆలోచించండి.మనం ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు వెళ్తాం. కొన్ని నిమిషాల్లో పని అయిపోతుంది. కానీ ఆ ఒక్క ఓటు కోసం రాజకీయ వ్యవస్థ ఎంత ఖర్చు పెడుతోందో లెక్కలు తెలిస్తే మతిపోతుంది. అంచనాల ప్రకారం 2024 ఎన్నికల్లో ఒక్కో ఓటరుపై సగటున దాదాపు ₹1,400 ఖర్చయింది. అంటే నలుగురు ఓటర్లు ఉన్న ఒక కుటుంబం కోసం సగటున ₹5,600.ఒక ఓటు కోసం ఇంత ఖర్చు పెట్టే వ్యవస్థ... ఆ ఓటు వెనుక ఉన్న పౌరుడి జీవితాన్ని మెరుగుపరచడానికి ఎంత ఖర్చు పెడుతోంది? అని. ప్రజాస్వామ్యం అందరికీ అవకాశం ఇవ్వాలి. కానీ ఎన్నికలు రోజు రోజుకీ మరింత ఖరీదైనవిగా మారుతున్న కొద్దీ ఒక ప్రమాదం పెరుగుతోంది. సామర్థ్యం ఉన్నవాళ్లు కాదు... సంపద ఉన్నవాళ్లు ముందుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది.ఎన్నికలు అంటే అభ్యర్థుల మధ్య పోటీగా కాకుండా... ఆర్థిక శక్తుల పోటీగా మారే ప్రమాదం వచ్చేసింది. ఈ క్రమంలో రాజకీయాల్లోకి రావాలనుకునే ఒక సాధారణ ఉపాధ్యాయుడు, ఒక రైతు, ఒక సామాజిక కార్యకర్తకు నిజంగా అవకాశం ఉంటుందా?అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే నాయకుల జీతాలను మాత్రమే కాదు... ఎన్నికల్లో ప్రవహిస్తున్న డబ్బును కూడా ప్రశ్నించారు.

## మహోత్సవం బోనాల పండుగ

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్ డిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, డిజిపి సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, ఆర్&బీ, వాటర్ వర్క్స్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, మెట్రో, పర్యాటక, సమాచార పౌరసంబంధాల శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టే గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తాను లండన్ పర్యటనలో వున్నందున ఇక్కడి నుంచే జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు సూచనలివ్వాల్సి వస్తున్నదని అన్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రభుత్వం నిష్ఠతో కార్యాచరణను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. గత కొన్నేళ్లుగా బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ నిధులను ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాల ఏర్పాట్లకు సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, రోడ్లుభవనాల శాఖ, వాటర్ వర్క్స్, ఆర్టీసీ, రైల్వే, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, పర్యాటక శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతల కోసం లాక్టేషన్ రూమ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ ఉచిత బస్సు ద్వారా బోనాల ఉత్సవాలు జరిగే ప్రాంతాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తాకిడి వుండే పరిస్థితుల నేపథ్యంలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కోరారు.

## ఏపీ చరిత్రలోనే సువర్ణ అధ్యాయం

పరిశీలించారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో ఖనిజంతో కూడిన మట్టిని సురక్షితంగా తరలించేందుకు సిద్ధం చేసిన భారీ లారీలు, టిప్పర్ వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు, మైనింగ్ ల్యాండ్‌స్కేప్‌లో అత్యాధునిక సాంకేతికత వినియోగాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు, ప్రాజెక్టు నిర్వాహకులను అభినందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం, మైనింగ్ సంస్థ అడుగులు వేస్తున్నాయి. మైనింగ్ ప్రాంతంలో నడిపే భారీ వాహనాలను నైపుణ్యంతో నడిపేలా ఏర్పాటు చేసిన సిమ్యులేటర్ యంత్రాల శిక్షణా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. స్థానిక మహిళలకు, యువతకు ఈ అత్యాధునిక సిమ్యులేటర్లపై డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. మహిళలు సైతం ఈ భారీ మైనింగ్ వాహనాలను నడిపేలా ఇక్కడ శిక్షణ పొందడం విశేషం. గత కొంతకాలంగా జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగిన బంగారం వెతికితీత పనులు పూర్తి స్థాయిలో విజయవంతమయ్యాయి. దాంతో, ఇప్పుడు కమర్షియల్ ఉత్పత్తికి లైన్ క్లియర్ అయింది. భారతదేశంలోనే ప్రైవేట్ భాగస్వామ్యంతో జరుగుతున్న అతి పెద్ద బంగారు గనుల ప్రాజెక్టులలో ఇది ఒకటి కావడంతో దేశవ్యాప్తంగా పారిశ్రామిక రంగం దృష్టి దీనిపై పడింది. ప్రాజెక్టు ప్రారంభం అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ఏపీని బంగారుమయమైన ఘన చరిత్ర వైపు నడిపించేందుకు ఈ ప్రాజెక్ట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాయలసీమ వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను చెరిపేస్తూ, జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ద్వారా ఇక్కడి వేలాది మంది యువతకు, మహిళలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ మైనింగ్ ప్రక్రియ సాగుతుందని సీఎం వెల్లడించారు.

ఇదిలావుంటే, జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న 'జియోమైసూర్' సంస్థ ఈ సందర్భంగా ఒక కీలక ప్రకటన చేసింది. ఏపీలో ఉత్పత్తి అయ్యే బంగారాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా, స్థానిక వ్యాపారులకే విక్రయిస్తామని స్పష్టం చేసింది. దీనివల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థకు భారీగా ప్రయోజనం చేకూరుతుంది. రాష్ట్రంలోని స్వర్ణకారులకు, వ్యాపారులకు నాణ్యమైన బంగారం నేరుగా లభిస్తుందని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. జొన్నగిరి మైనింగ్ క్లియరెన్స్ అనంతరం శుద్ధి చేసిన బంగారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పలు ప్రతిష్టాత్మక జ్యువెలరీ కంపెనీల అధినేతలకు అధికారికంగా అందజేశారు. జూన్ 25 గురువారం నుంచి అధికారికంగా బంగారం తవ్వకాలు ఊపందుకోనుండటంతో, జొన్నగిరి ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరడమే కాకుండా, దేశీయంగా బంగారు లభ్యత పెరిగి విదేశీ దిగుమతుల భారం కూడా తగ్గనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## తుంగభద్ర ఎత్తిపోతల పథకం

కాలేదన్న అంశంపై చర్చించారు. ప్యాకేజీ 1, 2 పనులు ఇప్పటికీ చేపట్టలేదని, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తి అయ్యాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలని రేపు కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగే సమావేశంలో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల ఆశించిన విధంగా నీటి మళ్లింపు సాధ్యం కావడం లేదని ఇంజనీర్లు తెలిపారు. 2004 లో నిపుణుల కమిటీ పూడిక తొలిగించాలని సూచించింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు ఇప్పటికి అమలు కాలేదని చర్చ జరిగింది. వెంటనే పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు.

పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉండటంతో ఆ రాష్ట్ర సహకారం కోరాలని నిర్ణయం తీసుకున్నారు. పూడికతీతతో పాటు 2004లో నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతి పత్రం అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అప్పటి నివేదికకు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితిని విశ్లేషించుకోవాలని సూచించారు. వెంటనే పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. తుమ్మిళ్ల నుంచి నీటిని వినియోగించుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ పెంచాలని, వీలైనంత వేగంగా పనులను చేపట్టాలని చెప్పారు.

## బరి తెగిస్తున్న మైనింగ్ మాఫియా

తనిఖీలు చేస్తున్నప్పుడు వాహనాలను నెమ్మదించాల్సింది పోయి, ఏకంగా ఒక జిల్లా స్థాయి అధికారిని తొక్కుకుంటూ వెళ్లడం వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అధికారులను భయభ్రాంతులకు గురిచేసి తమ దందా సాగించుకోవాలనే ప్లాన్‌లో భాగమేనా అనే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘోర ఉదంతాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని రవాణా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను ప్రత్యేక విచారణ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాదం జరిగిన తీరు, లారీ ఎక్కడి నుంచి వస్తోంది, ఎవరికి చెందింది, డ్రైవర్ వెనుక ఎవరైనా ఉన్నారా? అనే పూర్తి వివరాలపై ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.రహదారులపై అర్ధరాత్రి, తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించే ఫీల్డ్ అధికారుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందనే ఆవేదన సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

విచారణ అధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ పనుల్లో ఉండే అధికారుల రక్షణ కోసం ప్రభుత్వం సరికొత్త భద్రతా ప్రోటోకాల్స్‌ను తీసుకురానుంది. రాత్రి వేళల్లో తనిఖీలు చేసేటప్పుడు ఎలాంటి రక్షణ పరికరాలు వాడాలి, ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, పోలీసు బందోబస్తు ఎలా ఉండాలనే అంశాలపై ఒక ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ను ఖరారు చేయనున్నారు. నిజాయితీగా పనిచేసే ఒక ఉన్నతాధికారి విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం వ్యవస్థను ఆలోచింపజేస్తోంది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తేనే అసలు నిజాలు బయటకు రానున్నాయి. మైనింగ్, రవాణా మాఫియాల అండ చూసుకునే డ్రైవర్ ఈ సాహసానికి ఒడిగట్టాడా అనేది తేలాల్సి ఉంది.

# యాదగిరీశుడికి నిత్య పూజల వైభవం

- శ్రీవారి నిత్యరాబడి రూ.15.05 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 24:**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.15,05,998 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,02,400, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,19,100, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.88,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,78,800, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,35,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.44,600,ప్రసాద విక్రయం ద్వారా రూ.5,27,890, కల్యాణకట్ట ద్వారా రూ.43,150తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.





## యూరియా యాప్‌ను వెంటనే తొలగించాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 24 :**

రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే తొలగించి న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కోసం రైతులకు అర్థం కాకుండా ప్రభుత్వం యాప్‌ను తీసుకొచ్చిందని,దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతాంగానికి ఉపయోగపడే కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, రైతులు ఎన్ని ఎకరాలకు సాగు చేస్తే అన్ని ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. జూన్ 30లోగా రైతుల ఖాతాలకి రైతు భరోసా జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్,రైతు సంఘం జిల్లా నాయకులు కల్లేపల్లి మహేందర్,కంబాల వెంకటేష్, రైతులు కొండయ్య, నరసింహారెడ్డి,అండాలు, వడ్లకొండ మధు,మిట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి తాగునీటి సరఫరా పనులను పరిశీలించిన జలమండలి ఎండీ

- సెప్టెంబర్-2027 నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలని అధికారులకు, ఏజెన్సీలకు ఆదేశాలు

**జయభేరి, హైద్రాబాద్ :**

హైద్రాబాద్ ప్రజలకు భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్ II,III పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లన్న సాగర్ వద్ద నిర్మాణంలో ఉన్న పంప్ హౌస్ పనులతో పాటు 3000 మిల్లీమీటర్ల వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రాజెక్టు అమలులో ఉన్న వివిధ నిర్మాణ కార్యకలాపాలను పరిశీలించి, పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన అదనపు సిబ్బంది, యంత్రాలను సమకూర్చుకోవాలని సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. నిర్ణీత గడువు ప్రకారం సెప్టెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అలాగే నిర్మాణ ప్రదేశాల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్, ప్రాజెక్ట్ విభాగపు అధికారులు, ప్రాజెక్టు అమలు సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## కౌకుంట్లలో ముమ్మరంగా పీర్ల వేడుకలు

- నేటి అర్ధరాత్రి ఊరేగింపు ప్రారంభం
- ఈనెల 26న ఉత్సవాల ముగింపు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండల కేంద్రంలో చెన్నారం హుస్సేన్ సాహెబ్ పీర్ల వేడుకలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది గ్రామంలో చెన్నారం హుస్సేన్ సాహెబ్ పీర్ల వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా గత వారం రోజుల క్రితం పీర్ల వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల సందర్భంగా పీర్లను వివిధ రకాల వెండి వస్తువులతో సర్వాంగ సుందరంగా అలంకరించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు పీర్ల మసీదు ముందు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.అలై బలై ఆడుతున్నారు. కోలాటాలు వేస్తున్నారు. చాలామంది పీర్లకు వెండి వస్తువులు సమర్పించి మాలీదల తో ఫాతేహాలు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కొంతమంది కందూర్లు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం అర్ధరాత్రి పీర్ల ఊరేగింపు ప్రారంభం కానుంది. దీనికిగాను నిర్వాహకులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఈనెల 26న పీర్ల వేడుకలు ముగియనున్నాయి.

## లంకెలపాలెంలో ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం లంకెలపాలెం గ్రామ పరిధిలోని సోమవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో జీపీఆర్ లేఔట్ సమీపంలో జాతీయ రహదారి 16పై ఓ ఆటో రిక్షా స్వయంగా అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.ఈ సంఘటన పై స్థానిక పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం మృతుడు దుంగా అప్పలనాయుడు గాజువాక మండలం దాసిమికొండ కాలనీ పంతులుగారిమేడ నివాసి.ఇతను ఆటో రిక్షాను నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి నర్సీపట్నం నుండి గాజువాక వైపు వస్తుండగా లంకెలపాలెం సమీపంలో ఆటో రిక్షా అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కేజీహెచ్, విశాఖపట్నం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు దుంగా వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీస్ స్టేషన్‌లో కింద కేసు నమోదు చేసి, ఎస్ఐ చి. భీమరాజు దర్యాప్తు చేపట్టారు.

# బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలి

- చాత్రింకి గుంజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట:**

అర్హుడైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండే విధంగా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం,అనర్హుల పేర్లు తొలగింపు,వివరాల సవరణ వంటి అంశాలపై సూచనలు చేశారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని,ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు ,చిరునామా మార్పులు,పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని,ఓటు హక్కు వినియోగంపైన ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు,పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాహుల్ గాంధీ చాత్రింకి గుంజ్ కార్యక్రమాన్ని చేపట్టానున్నారు. ఈ నెల 26న యాదగిరిగుట్టలో జరిగే చాత్రింకి గుంజ్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, విద్యార్థులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు,ప్రజాప్రతినిధులు,బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మత్తు రహిత సమాజమే నవభారత లక్ష్యం

**జయభేరి, అనకాపల్లి:**

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మత్తు రహిత భారత వారోత్సవాలు కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. జూన్ 17 నుండి జూన్ 26 వరకు 10 రోజుల పాటు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. యువత భాగస్వామ్యం పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు పంచాయతీ రాజ్ సంస్థలు, మహిళా సంఘాలు, స్థానిక లీడర్ల సహకారంతో ఊరూరా చైతన్య పరచడం అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు, వీధి నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుపబడుతున్నాయి.జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆరోగ్యం కోసం యోగా డ్రగ్స్‌కు నో చెప్పండి అనే సందేశంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడ్డాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిళ్లు, సబ్ డివిజన్ల అధికారులు ఈ 10 రోజుల కార్యక్రమాలను విధిగా నిర్వహించి, విజయవంతం చేయాలి. ప్రతిరోజూ జరిగిన కార్యక్రమాల నివేదికను సమర్పించవలసి ఉంటుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా వీటికి విస్తృత ప్రచారం కల్పించాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.






## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- భట్టుపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం భట్టుపల్లి శివాలయంలో బుధవారం జరిగిన విగ్రహాల ప్రతిష్టాపన మరియు ధ్వజస్తంభం ప్రతిష్టాపన మహోత్సవ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గ్రామస్తులు కలిసికట్టుగా దేవాలయం అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినంద నీయమన్నారు. ఈ సందర్భంగా రూ.5 లక్షల నిధులతో నిర్మించే ఆలయ షెడ్డు నిర్మాణం కోసం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. దేవస్థానం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మూడావత్ బాలకోటితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సోదరుడు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండలం దుప్పల్లి లో బుధవారం మండ్ల కొండన్న ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు భాస్కర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మున్సిపాలిటి కేంద్రంలో బుధవారం 2వ వార్డు కౌన్సిలర్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయిరాం యాదవ్ కుమారుడి జన్మదిన వేడుకల్లో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలుడ్ని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. అలాగే భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో మూసాపేట్ మండలం వేముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రామన్ గౌడ్ కుమారుడి వివాహానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అంతేకాకుండా కొత్తకోట పట్టణంలో పాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ నీరజ సత్యనారాయణ కుమార్తె వివాహానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ కూడా నూతన వధూవరులను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందేనని ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్లలో సౌకర్యాలు, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎదురవుతున్న సవాళ్లు, తదితర అంశాలపై మంత్రి సమీక్ష చేశారు. ఐటీడీఏ ప్రోగ్రామ్ ఆఫీసర్లతో గతంలో చేసిన రివ్యూలో తీసుకున్న నిర్ణయాల అమలుపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవింద్ర నాయక్, ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ప్రోగ్రామ్ ఆఫీసర్లు రాహుల్, మకరంద్, లెనిన్, ట్రైబల్ వెల్ఫేర్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్పిటళ్ల అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, తమకు ఎదురు అవుతున్న వివిధ రకాల చాలెంజెస్‌ను అధికారులు మంత్రికి వివరించారు.



రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు, మాతా, శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, డయాలసిస్, క్యాన్సర్ స్క్రీనింగ్, సికిల్ సెల్ నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మందులు, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన వైద్య పరికరాలు ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. 108, 102 అంబులెన్స్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇటీవల గుండాల పీహెచ్‌సీలో జరిగిన మెటర్నల్ డెత్ ఘటన నుంచి ప్రతి అధికారి పాఠాలు నేర్చుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణలో ఉంచాలని, డెలివరీ డేట్ కంటే ముందుగానే, బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించాలని ఆదేశించారు. మాతా, శిశు సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న గిరిజన ప్రాంతాల ప్రజలకు చికిత్స మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం ఏజెన్సీ జిల్లాల్లో 25 డయాలసిస్ సెంటర్ల ద్వారా 1,373 మంది యాక్టివ్ రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా 170 మిషన్లతో మరో 34 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశామని మంత్రి గుర్తు చేశారు. అలాగే, ఎమర్జెన్సీ డయాలసిస్ సేవల కోసం ఏజెన్సీ ప్రాంతాల్లోని 12 హాస్పిటళ్లలో అదనంగా 37 డయాలసిస్ మిషన్లను మంజూరు చేస్తున్నామన్నారు. కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు త్వరగా పూర్తయ్యేలా ఆరోగ్యశాఖతో పాటు, ఐటీడీఏ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గురుకులాలను సమీపంలోని హాస్పిటళ్లకు ట్యాగ్ చేయాలని గతంలో మంత్రి సూచించగా, ఈ సమీక్షలో అధికారులు మంత్రికి మ్యాపింగ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గిరిజన, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను సమీప ప్రభుత్వ హాస్పిటళ్లతో అనుసంధానం చేసిన ప్రత్యేక మ్యాపింగ్‌ను మంత్రి సమీక్షించారు. దీనివల్ల అవసరమైన సందర్భంలో విద్యార్థులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. హాస్పిటల్ నుంచి 20 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న విద్యాసంస్థలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అత్యవసర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్, తలసీమియా, రక్తహీనత, క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. మొబైల్ యూనిట్ల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను విస్తరించడంతో పాటు క్యాన్సర్ నోటిఫికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.



## దేవస్థానం ఈఓకు సన్మానం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర శ్రీ శ్రీ శ్రీ దేవాలయం ఈఓ శివానంద చారికి బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. దేవస్థానానికి శివానంద చారి ఇటీవల బదిలీపై వచ్చి దేవస్థానం ఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గౌని రాము, గౌని శ్రీనివాస్, నాగేష్, డివిజన్ ఇన్స్ పెక్టర్ శ్రీనివాస్, కౌకుంట్ల నాగేశ్వరరావు లతోపాటు ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలను త్వరగా పూర్తి చేయాలి

- బొచ్చు కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు




జయభేరి, పరకాల, జూన్ 24:

బుధవారం ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు విద్యార్థులకు సరిపడా తరగతి గదులులేక చదువుకు దూరం అవుతున్నారు వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించి విద్యార్థులకు న్యాయం చేయాలి లేదంటే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు అజయ్ సహాయ కార్యదర్శి వినయ్ విష్ణు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ కాలనీలో త్రాగునీరు సమస్య

- సరిపడా నీరు సరఫరా లేకపోవడంతో గొడవలకి దిగుతున్న కాలనీ వాసులు



జయభేరి, పరవాడ:

పరవాడ మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో ప్రజలకి కేటాయించిన జగనన్న హౌసింగ్ కాలనీలో గృహలకు త్రాగునీటి సమస్య వలన కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.హౌసింగ్ కాలనిలో సుమారుగా 54 ఇంటి నివాసాలు ఉండడం వీటి అన్నింటికీ ఒకే మోటార్ పని చేస్తూ ఉండడంతో సమస్య తీవ్రతరం అవుతుందని ఇటీవల సుమారుగా వారం రోజులు పాటు మోటార్ పని చెయ్యకపోవడంతో అక్కడ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డం అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికి త్రాగునిరు పైప్ల ద్వారా కొండపైన ఉన్నా గృహలకి సరిగా నీరు అందకపోవడంతో నీటి కోసం కాలనీ వాసులు ఒకరి ఒకరు గొడవలు పడే స్థాయికి వెళ్ళుతుడడంతో సమస్య మరింతగా జటిలం అవ్వుతుందని అక్కడ ప్రజానీకం వాపోతున్నారు.సమస్య పైన పంచాయతీ అధికారులకి తెలియజేసిన కంటితుడుపు చర్యలే చేపడుతున్నారని వెంటనే దీనిపై పంచాయతీ అధికారులు మండల అధికారులు వెంటనే స్పందించి జగనన్న హౌసింగ్ కాలనీలో ఉన్నా నీటి సమస్యపై శ్వాసత పరిష్కారం చూపెడుతూ తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ధ్వజస్థంబం పూజ లో పాల్గొన్న హైకోర్టు న్యాయవాది



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మండలం బట్టుపల్లి లో బుధవారం శ్రీ శ్రీ శ్రీ కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆదిత్యాది నవగ్రహ పూర్వక నాభిశిలా సహిత ఆలయ శిఖర ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో సరోజ్ రెడ్డి పాల్గొన్నారు. పూజా కార్యక్రమానికి హాజరైన సరోజ్ రెడ్డిని కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.

## వివాహ వేడుకల్లో ప్రశాంత్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో బుధవారం జరిగిన పలు వివాహ శుభకార్యాలకు దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

## రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్
- మదనాపురంలో విత్తనమేళ




జయభేరి, దేవరకద్ర :

రైతులు విత్తనమేలాలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) రైతులకు సూచించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానాకాలం సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను నేరుగా రైతులకు అందించేందుకు చేపట్టిన విత్తన మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జియంఆర్ ప్రసంగించారు.వానాకాలం సీజన్‌కు అవసరమైన విత్తనాలను రైతులకు ఒకేచోట అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో రైతువేదికలలో విత్తనమేళాలు ఏర్పాటు చేశామన్నారు. వరితో పాటు ఉద్యాన పంటల సాగుపైనా రైతులు దృష్టిసారించాలన్నారు. నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన విత్తన మేళాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం ఆమోదించిన 7 రకాల సన్నాలు 1. తెలంగాణ సోనా (RNR15048), 2. సాంబ మసూరి (BPT5204), 3. హెచ్ఎంటి సోనా (HMT), 4. జై శ్రీరామ్ (Jai Sriram), 5. కేఎన్ఎం - 1638 (కూనారం సన్నాలు / KNM1638), 6. వరంగల్ - 44 (సిద్ధి / WGL44), 7. కేఎన్ఎం - 7715 (KNM 7715) రకాలు రైతులు సాగు చేసుకుని, ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు రైతులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దక్షిణ ఎనర్జీ కంపెనీ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి

- ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్




జయభేరి, పరవాడ:

పరవాడ మండలంలో జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీని ఆనుకొని ఇండస్ట్రియల్ పార్క్ ఫేస్ 3 లో గల దక్షిణ ఎనర్జీ కంపెనీలో మంగళవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. అనంతరం దక్షిణ ఎనర్జీ కంపెనీపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఇండస్ట్రియల్ పార్కులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులతో దక్షిణ ఎనర్జీ యాజమాన్యం 24 గంటల పాటు పరిచయం పని ఒత్తిడి ఈఎస్ఐ, పిఎఫ్ లేకపోవడం హాజరు పట్టిక నిర్వహించకపోవడం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇట్లాంటి ప్రమాదాలు జరగకుండా భద్రత ఆడిట్ నిర్వహించాలని ఇండస్ట్రియల్ పార్కులో కార్మిక శాఖ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిత్యం పర్యవేక్షించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఏ విధమైన చట్టాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇండస్ట్రియల్ పార్కులో వందలాది మంది వలస కార్మికులను తీసుకొచ్చి 24 గంటలు పనులు చేయించి ఈ ప్రమాదాలకి కారణం అవుతున్నారని అన్నారు. యాజమాన్యాలు లాభాలే పరమార్ధం ఎవరు ఇస్తున్నారు తప్ప కార్మికుల రక్షణ భద్రత సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారని అన్నారు. ఈ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ కి సిఐటియు ఫిర్యాదు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే అప్పలరాజు, చిన్నారావు, శేషు, రమణ, సత్తిబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో హిట్లర్ పాలన

జయభేరి, హైదరాబాద్, జూన్ 24 :

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రైతుబంధు చెల్లింపులు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల అంశాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. గత కొంత కాలంగా రెవెన్యూ మంత్రికి వ్యతిరేకంగా భూ, మైనింగ్ సమస్యలపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## ఇంటింటికీ వెళ్లి SIR ప్రక్రియ

జయభేరి, ఉప్పల్ :

తెలంగాణలో SIR ప్రక్రియ జూన్ 25, 2026నుండి ప్రారంభం. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధృవీకరిస్తారు. ఈ హౌస్‌టుహౌస్ ఎన్యూమరేషన్ ప్రక్రియ జూలై 24, 2026 వరకు కొనసాగుతుంది.

ముఖ్య తేదీలు.. SIR ప్రారంభం : జూన్ 25, 2026, ఇంటింటి సర్వే.. జూన్ 25 - జూలై 24, 2026, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ.. జూలై 31, 2026, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దాఖలు.. జూలై 31 - ఆగస్టు 30, 2026, తుది ఓటరు జాబితా విడుదల.. అక్టోబర్ 1, 2026.

ఓటర్లకు సూచన: BLOలు మీ ఇంటికి వచ్చినప్పుడు సహకరించండి. మీ పేరు, చిరునామా మరియు ఇతర వివరాలను సరి చూసుకుని అవసరమైన ఫారమ్‌లను సమర్పించండి. ఓటరు జాబితాలో మీ పేరు ఉండేలా జాగ్రత్త పడండి. "అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హులు మరియు డూప్లికేట్ నమోదులను తొలగించడం SIR ప్రధాన ఉద్దేశం."

## థ్యాంక్ రేవంత్ అన్న ఉప్పల్ బాగాయత్ అభివృద్ధికీ

- ₹38.85 కోట్లతో ఉప్పల్ బాగాయత్ రూపురేఖలు మార్చేస్తాం



జయభేరి, ఉప్పల్ :

రేవంతన్న ఆశీస్సులతో, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పట్టుదలతో ₹38.85 కోట్లు మంజూరు. ఒకేసారి మంజూరైన 8 పనులు.. రోడ్ నెం.48 SW డ్రైన్ ఇరిగేషన్ నాలా నుండి మూసీ రివర్ వరకు ₹5.80 కోట్లు, రోడ్ నెం.55 SW డ్రైన్ ₹3.00 కోట్లు, భాగ్యత్ కమాన్ నుండి రోడ్ నెం.44 SW డ్రైన్ ₹5.00 కోట్లు, రోడ్ నెం.44 నుండి నాలా వరకు SW డ్రైన్ ₹5.80 కోట్లు, రోడ్ నెం.22 SW డ్రైన్ ఇరిగేషన్ నాలా నుండి మూసీ వరకు ₹5.80 కోట్లు, రోడ్ నెం.6 ఫేజ్ 2 SW డ్రైన్ ₹3.00 కోట్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి రోడ్ నెం.48, 22, 55 & మెయిన్ రోడ్ ₹5.50 కోట్లు, మల్టీ స్పోర్ట్స్ ఎరీనా యువతకు కానుక. ఉప్పల్ భగాయత్ ఫేజ్ I లేఅవుట్‌లో బేబీ పూల్, స్విమ్మింగ్ పూల్, ట్రిపుల్ జంప్, ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ సౌకర్యాలతో బహుళ క్రీడా సముదాయం (మల్టీ స్పోర్ట్స్ అరేనా) నిర్మాణం ₹4.95 కోట్లు, మొత్తం: ₹38.85 కోట్లు.

# మహిళలకు వరంగా 'ఇందిరమ్మ చీరలు'

- ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని శాంతి నగర్ లో చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీకి రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో నాసిరకం చీరలు ఇచ్చి మహిళల గౌరవాన్ని తగ్గించారని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత నాణ్యమైన, చేనేత కార్మికులు రూపొందించిన చేనేత వస్త్రాలను 'ఇందిరమ్మ సారె'గా అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు. సోనియా గాంధీ ఆశయాల స్ఫూర్తితో మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రతి ఆడబిడ్డకు ఈ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తాము నిరంతరం శ్రమిస్తామని భరోసా ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అర్హులైన మహిళలంతా ఇందిరమ్మ చీరలు తీసుకోవాలని కోరారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, అలుగుల అనీల్ కుమార్, కాటేపల్లి విజయ్ కుమార్ కుశంగళ సతీష్, సత్యనారాయణ చారీ, తైసీన్, బచ్చ రాము, బొడగే మల్లేష్, నామొజు నరేష్, వెంకటేష్ సేటు, గట్టు ఇందిరా, తుప్రాన్ అనిత, జనగామ విజయ, జి. రేణుక, తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా రాజన్న కోడెల పంపిణీ

- పక్కదారి పట్టించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- అర్హతలు ఉన్న వారికే 120 జతల జీవాల పంపిణీ

**జయభేరి, రాజన్న సిరిసిల్ల :**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల నుంచి అర్హులైన రైతులకు కోడెలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు బుధవారం 120 జతల కోడెలను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి కోడెను కట్టే సంస్కృతి ఇక్కడ ఉందని గుర్తుచేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాల లో ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ ఇతర శాఖల అధికారులతో నిత్యం తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ నియోజకవర్గం లోని మర్రిపల్లిలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల స్థలం గోశాలకు కేటాయించిందని తెలిపారు. త్వరలోనే గోశాల పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. కోడెలను సన్న, చిన్న కారు రైతులకు పంపిణీ చేస్తున్నామని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అర్హులైన రైతులకు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. కోడెలను సంరక్షించి.. వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు పశువైద్య, ఆలయ, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాజన్న ప్రసాదంగా స్వీకరించి.. కోడెలను రైతులు వ్యవసాయ పనులకే వినియోగించాలని సూచించారు నిరంతరం కోడెలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు కోడెలను తనిఖీ చేస్తామని తెలిపారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ కె. ఎస్ బి. కుమారి, ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ లోకేష్, వ్యవసాయ, రెవెన్యూ, ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు పంపిణీ

**జయభేరి, ఘట్కేసర్ :**



మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్ 6 డివిజన్ పరిధిలోని ఎన్ఎఫ్సీ నగర్, అంబేద్కర్ నగర్, ఏడబ్ల్యూఎస్ కాలనీ, కొండాపూర్, డ్వాక్రా బిల్డింగ్, మార్కెట్ రోడ్ లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాల యాదవ్ హాజరై డ్వాక్రా మహిళా గ్రూపు సభ్యులకు చీరలను అందించారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేష్, నస్రిన్ సుల్తానా, బర్ల శశికళ దేవేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ రమేష్, మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్లు బర్ల దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజు, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ఎస్సీ సెల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి సునీల్, మైనార్టీ అధ్యక్షులు ఫారుక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, సేవాదళ్ అధ్యక్షులు బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటనారాయణ ముదిరాజ్, అంజనేయులు పంతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరాజుద్దీన్, మహమ్మద్ అబ్దుల్ కయ్యుమ్, విజయ్ కుమార్, నాయక్, కడుపోల్ల రాజు, రామస్వామి, ప్రశాంత్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

## వివాదంలో ఎంపీ సీఎం

**జయభేరి, భోపాల్, జూన్ 24 :**



మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ఒక భారీ భూ కుంభకోణం వ్యవహారం ఒక్కసారిగా దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబ సభ్యులు ఉజ్జయిని నగర పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసిన తీరు తీవ్రమైన వివాదానికి దారితీసింది. సీఎం పదవి చేపట్టిన నాటి నుంచి ఆయన భార్య, కుమారుడు, కోడలు, సోదరులు, కజిన్స్ అందరూ కలిసి వందల కోట్లు పలికే ప్రైమ్ ల్యాండ్స్‌ను తమ ఖాతాలో వేసుకున్నట్లు వెల్లడవడంతో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ దీనిని మహాకాల్ భూముల దోపిడీ గా అభివర్ణిస్తూ సీఎం రాజీనామాకు డిమాండ్ చేస్తోంది.2023 డిసెంబర్‌లో మోహన్ యాదవ్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి గడిచిన రెండేళ్ల కాలంలో ఆయన భార్య సీమా యాదవ్, కుమారుడు వైభవ్ యాదవ్, కోడలు శాలిని యాదవ్, సోదరులు నందలాల్, నారాయణ్ యాదవ్, కజిన్స్ కలిసి ఉజ్జయిని ప్రాంతంలో దాదాపు 137 ప్లాట్లలో విస్తరించి ఉన్న 168 ఎకరాల భూమిని కేవలం 45 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసినట్లు భూమి యాజమాన్య రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ లావాదేవీలు కొన్ని నేరుగా వారి పేర్ల మీద, మరికొన్ని వారి కుటుంబానికి చెందిన నాలుగు రియల్ ఎస్టేట్ కంపెనీల ద్వారా జరిగాయి. ఈ భూముల కొనుగోలు జరిగిన కొద్ది కాలానికే.. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉజ్జయిని నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఉజ్జయిని మాస్టర్ ప్లాన్ 2035 ను అధికారికంగా ప్రకటించింది. చిత్రం ఏమిటంటే, ఈ మాస్టర్ ప్లాన్ కింద ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త జాతీయ రహదారులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, బైపాస్ రోడ్లు, సింహస్థ కుంభమేళా మౌలిక వసతుల ప్రాజెక్టులన్నీ సరిగ్గా సీఎం కుటుంబం కొనుగోలు చేసిన 111 ఎకరాల భూముల పరిసర ప్రాంతాల గుండానే వెళ్తున్నాయి. అంతకంటే షాకింగ్ విషయం ఏమిటంటే.. వీరు కొనుగోలు చేసిన వ్యవసాయ భూములన్నీ ఈ మాస్టర్ ప్లాన్ రాకతో రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్లుగా మారిపోయాయి. ప్రభుత్వ ప్రాజెక్టుల ప్రకటనకు ముందే ఇన్‌సైడర్ సమాచారంతో ఈ భూములు కొన్నారనే ఆరోపణలకు బలం చేకూరుస్తూ.. మాస్టర్ ప్లాన్ విడుదలైన వెంటనే ఆయా ప్రాంతాల్లోని ల్యాండ్స్ వాల్యూ రాత్రికి రాత్రే రాకెట్ వేగంతో పెరిగిపోయింది. 45 కోట్లకు కొన్న భూముల విలువ ఇప్పుడు వందల కోట్లకు చేరింది. ఈ వ్యూహాత్మక ల్యాండ్ బ్యాంక్‌ను ఉపయోగించుకుని సీఎం కజిన్స్ అప్పుడే కొన్ని ప్రైవేట్ బిల్డర్లతో హౌసింగ్ ప్రాజెక్టుల కోసం డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు కూడా కుదుర్చుకున్నట్లు ఆధారాలు లభించాయి. దీంతో ముఖ్యమంత్రి తన అధికారిక పరపతిని వాడుకుని ముందే ప్లాన్ చేసి తన కుటుంబానికి లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి .ఈ వివాదంపై ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా స్పందించనప్పటికీ, సీఎం కుటుంబ సభ్యులు , అధికారులు మాత్రం ఈ ఆరోపణలను ఖండించారు. తమ కుటుంబం 2010 నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉందని, తాము ప్రైవేట్ వ్యక్తులుగా సాధారణ వ్యాపార పద్ధతుల్లోనే భూములు కొన్నామని సీఎం మేనల్లుడు అనంత్ యాదవ్ వాదించారు. అయితే కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ .. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో లూటీ ఇంజన్ నడుస్తోందని ఎద్దేవా చేశారు. గతంలో 100 ఎకరాలు ఉన్న ఈ ఫ్యామిలీ ఆస్తులు సీఎం అయ్యాక ఏడాదిన్నరలోనే 335 ఎకరాలకు ఎలా పెరిగాయో సమాధానం చెప్పాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో జుడీషియల్ విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

## అవనిగడ్డలో మంత్రి లోకేష్ పర్యటన

**జయభేరి, అవనిగడ్డ :**



మంత్రి నారా లోకేష్ అవనిగడ్డ నియోజకవర్గలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి లోకేష్కు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కొక్కిలిగడ్డ నుంచి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి మంత్రి చేరుకున్నారు. ఆలయం వద్ద దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు వేద ఆశీర్వచనాలతో స్వాగతం పలికారు. ఆలయం సమీపంలో గ్రామస్తులు, భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. "బాగున్నారా" అంటూ ప్రజలతో కరచాలనం చేసారు. స్వామివారి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందించి మంత్రిని సత్కరించారు. అనంతరం మోపిదేవిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయ సమావేశంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ తదితరులు దర్శనంలో పాల్గొన్నారు. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో ముచ్చటించి విద్యా సదుపాయాలపై ఆరా తీసారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పర్యటన మొత్తం సందర్భంగా ప్రజలు, కార్యకర్తలు, నాయకులతో మమేకమై మంత్రి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.



## కోటిలింగాల స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**

చిలుకానగర్ హరిహర క్షేత్రం శ్రీ చిలుకేశ్వర ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన కోటిలింగాల స్థాపన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొని, కోటిలింగాల స్థాపన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి కృష్ణ ,ఆలయ కమిటీ సభ్యులు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బృందావన్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ డివిజన్ లోని బృందావన్ కాలనీలో 54 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మాజీ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి దృష్టికి ఇటీవల కాలనీలవాసులు రోడ్డు సమస్యలను తెచ్చారు. దీనిపై స్పందించిన మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు. బుధవారం సీసీ రోడ్డు పనులను ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం కేటీఆర్ నగర్ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, బృందావన కాలనీ ప్రెసిడెంట్ కాంతారావు, వైస్ ప్రెసిడెంట్, పవన్ కుమార్, నరసింహ, కాంతారావు రామ చందర్, పవన్, బాలన్న, నాగరాజు,శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ చందు, తిక్కారెడ్డి, దుర్గాప్రసాద్, ప్రసాద్, చలపతి, బలరాం, రేణుక, పద్మ, రాధమ్మ, నదియా, ముజ్జు, రజియా, రేష్మ, తాజా పాషా షరీఫ్ అలీ ఫయాజ్ అయ్యా, కాజా, గౌస్ పాషా భాయ్ నజీర్, మాలిక, స్వప్న, లక్ష్మీ, బలమని, గోవర్ధన్ నాగరాజు, సందీప్, భాస్కర్, అలీమ్, సుధాకర్, సాయిలు డేవిడ్, సంతోష్.లో కాలనీవాసులు పాల్గొన్నారు.

## బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరు



**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో మంజూరు కావడం పట్ల, బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు కుర్మ సంఘ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుర్మ సంఘ అధ్యక్షులు బట్ట బాలకృష్ణ, సూరారం విలేజ్ చైర్మన్ బట్ట నర్సింహా, ఆలయ అధ్యక్షులు బాలయ్య, పెంటయ్య, సెల్వియోజి సత్తయ్య, చిన్న సత్తయ్య, బాలరాజ్, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్




**జయభేరి, శేరిలింగంపల్లి :**

శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆశ నగర్ కాలనీ హైటెన్షన్ రోడ్డులో కోటి రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఆశా నగర్ హైటెన్షన్ లైన్ లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గోపాల్, లింగం, నాగేష్ గౌడ్, సత్తయ్య, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# షూటింగ్ టైంలో ఎంజాయ్ చేశా..



యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో రాబోతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'ఆల్ఫా'. ఇండియాలో ఇది వరకెన్నడూ రానట్టుగా అలియా భట్, షర్వారిలతో భారీ బడ్జెట్ యాక్షన్ మూవీని రూపొందించారు. ఆల్ఫా చిత్రం ఆటిట్యూడ్‌కు ఒక వేడుకగా, ప్రతీకగా నిలిచే ఓ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ మూవీ షూటింగ్, అందులోని క్షణాల్ని తాను ఎప్పటికీ మర్చిపోలేను అని అలియా భట్ అన్నారు. 'ఆల్ఫా' చిత్రానికి పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమాల్లో ఇది కూడా ఒకటిగా నిలుస్తుంది. యాక్షన్, గ్రాండియర్, అడ్వెంచర్‌లతో కూడిన ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది నేను మునుపెన్నడూ అనుభవించని ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్. షూటింగ్‌లోని ప్రతీ క్షణాన్ని నేను ఎంతో ప్రేమించాను, ఆస్వాదించాను. ఈ చిత్రంలోని కథ ఇద్దరు మహిళ కథానాయికల చుట్టే తిరుగుతుంది. అదే నాకు ఎక్కువగా నచ్చిన అంశం. ఇలాంటి గొప్ప స్క్రిప్ట్‌లు మనం అరుదుగా చూస్తుంటాం. ఈ ప్రయాణంలో భాగం అవ్వడం నాకెంతో సంతోషానిచ్చింది. 'ఆల్ఫా' అనేది ఆటిట్యూడ్‌కి, సెలెబ్రేషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తుంది. ఇలాంటి ఓ అద్భుతమైన బృందంతో కలిసి పని చేయడం నాకు మరింత ప్రత్యేకంగా అనిపించింది' 'మా దర్శకుడు, నటీనటులు, యాక్షన్ టీమ్, తెర వెనుక సిబ్బంది ఇలా అందరం కలిసి ఎంతో కష్టపడి ఉత్సాహంతో పని చేశాం. మా ఉత్సాహం అంతా కూడా తెరపై ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నాను. ప్రతి ఉదయం సెట్‌కు వెళ్లడానికి మనస్ఫూర్తిగా ఎదురుచూసేదాన్ని, చిత్రీకరణలోని ప్రతి నిమిషాన్ని ఆస్వాదించాను' అని అలియా భట్ చెప్పుకొచ్చారు. ఆదిత్య చోప్రా నిర్మాణంలో 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ దర్శకత్వం వహించిన 'ఆల్ఫా' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# మంగళగిరిలో మెగా మూమెంట్..

## జనసేన కార్యాలయంలో పవన్‌ను కలిసిన రామ్ చరణ్

మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మర్యాదపూర్వకంగా కలుసుకోవడం రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. చాలాకాలం తర్వాత బాబాయ్‌అబ్బాయ్ ఒకే వేదికపై కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్5 ముగింపు దశ మ్యాచ్‌ల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రామ్ చరణ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వెళ్లే ముందు ఆయన మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయానికి చేరుకుని పవన్ కళ్యాణ్‌ను కలిశారు. చరణ్‌ను చూసిన పవన్ కళ్యాణ్ ఆప్యాయంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇద్దరూ కొంతసేపు ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.ఈ సమావేశంలో కుటుంబ విషయాలతో పాటు సినీ ప్రాజెక్టులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బాబాయ్‌అబ్బాయ్ మధ్య ఉన్న ఆత్మీయత మరోసారి ఈ భేటీ ద్వారా బయటపడిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు #PawanKalyan, #RamCharan, #MegaFamily వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో పోస్టులు షేర్ చేస్తున్నారు. మెగా అభిమానులు ఈ భేటీని ఒక ప్రత్యేక సందర్భంగా భావిస్తూ, ఇద్దరూ కలిసి ఉన్న క్షణాలను పెద్ద ఎత్తున ట్రెండ్ చేస్తున్నారు. ఇటీవల విడుదలైన రామ్ చరణ్ చిత్రం 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సినిమా విజయోత్సాహంలో ఉన్న చరణ్ ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించారు. ఇక పవన్ కళ్యాణ్ కూడా రాజకీయ బాధ్యతలతో పాటు తన సినిమా ప్రాజెక్ట్‌లను ముందుకు తీసుకెళ్తున్నారు. దీంతో మెగా అభిమానుల్లో మరోసారి ఉత్సాహం నెలకొంది.

# 'రణబాలి'లో అదే హైలైట్!



అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' నిర్మాణం నుంచే భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. 19వ శతాబ్దం నాటి ఈ కథలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా విజయ్ దేవరకొండ కనిపించనున్నారు. ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు, 'ది మమ్మీ' ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ ప్రధాన ప్రతినాయకుడు పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'అత్యంత క్రూరుడైన కరువు నేల రాక్షసుడు' అనే క్యాప్షన్‌తో ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఇటీవలే ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేశారు.ఈ నేపథ్యంలో దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ 'రణబాలి' గురించి సోషల్‌మీడియా ద్వారా ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ, ఆర్నాల్డ్ వోస్లూ మధ్య వచ్చే క్లైమాక్స్ ఘట్టాలు రోమాంచితంగా సాగుతాయని, దాదాపు 16 రోజుల పాటు క్లైమాక్స్ షూట్ జరిపామని చెప్పారు. 'సినిమాకు గ్లోబల్ అప్పీల్ ఉండాలనే ఉద్దేశ్యంతో ఆర్నాల్డ్ వోస్లూని విలన్‌గా తీసుకున్నాం. షూటింగ్ కోసం ఆయన ఆరు నెలల పాటు హైదరాబాద్‌లోనే ఉన్నారు. పతాక సన్నివేశాలను లార్జ్‌స్కేల్‌లో డిజైన్ చేశాం. సినిమాలో అవే హైలైట్‌గా నిలుస్తాయి' అని రాహుల్ సాంకృత్యాన్ తెలిపారు. సెప్టెంబర్ 11న 'రణబాలి' ప్రేక్షకుల ముందుకురానుంది.

# సెలబ్రిటీల ఫేవరెట్ కారును సొంతం చేసుకున్న ప్రముఖ కొరియోగ్రాఫర్..!



ప్రస్తుతం సినీ తారలు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు, ఈ జాబితాలో ప్రభుదేవా కూడా చేరారు. ఎంజీ సంస్థ ప్రెసిడెన్షియల్ లిమోసిన్‌గా ప్రచారం చేస్తున్న 'MG M9' లగ్జరీ ఎంపీవీ, కియా కార్నివాల్ కంటే పెద్దదిగా ఉంటూ ప్రీమియం అనుభూతిని అందిస్తుంది. ఒకే ఛార్జింగ్‌తో 548 కి.మీ రేంజ్ ఇచ్చే ఈ లగ్జరీ వెహికల్ గురించి, దాని ఇంటీరియర్, సాంకేతిక ఫీచర్ల గురించి తెలుసుకుందాం..

లగ్జరీకి మరో పేరు

ప్రభుదేవా ఎంచుకున్న ఈ MG M9 కాంక్రీట్ గ్రే రంగులో చాలా ఆకర్షణీయంగా ఉంది. ఎంజీ సంస్థ భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఈ ఎలక్ట్రిక్ ఎంపీవీ, 5,270 మి.మీ పొడవుతో చాలా విశాలంగా ఉంటుంది. దీనిలోని LED డే టైమ్ రన్నింగ్ లైట్లు, భారీ గ్రిల్, కనెక్టెడ్ టెయిల్ ల్యాంప్‌లు దీనిని రోడ్డుపై వేరుగా నిలబెడతాయి. మొదటి చూపులోనే ఇది హైఎండ్ లగ్జరీ వాహనం అనే ఫీలింగ్‌ను కలిగిస్తుంది.

ఇంటీరియర్.. ఈ కారు ఇంటీరియర్ అద్భుతంగా ఉంటుంది. కాగ్నాక్, బ్లాక్ కలర్ థీమ్ మరియు వుడ్ ఫినిష్ ఇన్‌సర్ట్‌లు ప్రీమియం అనుభూతినిస్తాయి. ఏడు సీట్ల ఈ ఎంపీవీలో, రెండో వరుసలో ఉన్న కెప్టెన్ సీట్లు ప్రధాన ఆకర్షణ. వీటిని టచ్ స్క్రీన్ ద్వారా కంట్రోల్ చేయవచ్చు. ఈ సీట్లలో హీటింగ్, వెంటిలేషన్, మసాజ్ ఫంక్షన్ వంటివి ఉన్నాయి. అవసరమైతే వీటిని బెడ్‌లా మార్చుకోవచ్చు. 12 స్పీకర్ల JBL సౌండ్ సిస్టమ్, లెవెల్2 ADAS మరియు 360 డిగ్రీ కెమెరా వంటివి ప్రయాణాన్ని మరింత సుఖమయం చేస్తాయి.

పర్ఫార్మెన్స్, ధర... MG M9లో 90 kWh బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు, ఇది ఒక్కసారి ఛార్జ్ చేస్తే 548 కి.మీ వరకు ప్రయాణించే రేంజ్ అందిస్తుంది. 242 bhp శక్తిని ఉత్పత్తి చేసే ఈ కారు, లగ్జరీ సెగ్మెంట్లో ఎంతో శక్తివంతమైనది. దీని ధర రూ. 70.90 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఇది కేవలం ప్రత్యేక 'MG Select' డీలర్‌షిప్‌ల ద్వారా మాత్రమే లభిస్తుంది. హేమా మాలిని, శంకర్ మహాదేవన్, కేఎల్ రాహుల్ వంటి ఎంతోమంది ప్రముఖులు ఇప్పటికే ఈ కారును కొనుగోలు చేశారు. సెలబ్రిటీలందరికీ ఇష్టమైన లగ్జరీ ఎలక్ట్రిక్ కారుగా MG M9 ఇప్పుడు దూసుకుపోతోంది. మీరు కూడా విలాసవంతమైన ప్రయాణాన్ని ఇష్టపడే వారైతే, ఈ లగ్జరీ ఈవీ ఒక చక్కని ఎంపిక కావచ్చు. ప్రభుదేవా కొత్త కారు ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.



# నేపాల్ ప్రకృతి అందాల మధ్యలో మీనాక్షి చౌదరి..

ప్రస్తుతం తెలుగులో ది మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల లిస్టులో మీనాక్షి చౌదరి కూడా ఒకరు. ఇటీవల ఈ అమ్మడు నటించిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ అవుతున్నాయి. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టుతున్నాయి. 2024లో మీనాక్షి నటించిన లక్కీ భాస్కర్ వంద కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఇక గతేడాది వెంకటేష్ తో కలిసి ఆమె నటించిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ రూ. 350 కోట్లకు పైగా కలెక్షన్లు కూడా సాధించింది. ఇక ఈ ఏడాది సంక్రాంతికి అనగనగా ఒక రాజు సినిమాతో మరో బ్లాక్ బస్టర్ అందుకుందీ ముద్దుగుమ్మ. ఈ మూవీ కూడా రూ. 100 కోట్లకు పైగానే కలెక్షన్లు సాధించింది. ఆమె కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. స్తుతం అక్కినేని నాగార్జునతో కలిసి వృషకర్మ అనే హారర్ థ్రిల్లర్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది మీనాక్షి. విరూపాక్షి సినిమాతో అందరి దృష్టి ఆకర్షించిన కార్తీక్ దండు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ లో బిజీగా ఉంటోన్న మీనాక్షి తాజాగా నేపార్ వెకేషన్ కు వెళ్లింది. అక్కడి ప్రకృతి అందాలను మనసారా ఆశీర్వదించి. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆమెనే స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**